# కార్పోరేట్ తుగ్లక్

-ఎం.వీరేశ్వరరావు

ఆ రోజు కొత్త అక్కౌంట్స్ మేనేజర్ వస్తున్నాడని అందరూ ఆతృతగా ఉన్నారు.

సరిగ్గా పదకొండు గంటలకు కొత్త మేనేజర్ వచ్చాడు.

వచ్చిన తరువాత పరిచయాలయ్యాయి. కంప్యూటర్ సెక్షన్ ఇన్‌చార్జి అయిన నన్ను పిలిచాడు సీట్లో కూర్చున్న అరగంట తరువాత. కంప్యూటర్‌లో వైరస్ ఉందేమోననుకుని వెళ్లాను.

"చూడండి వెంకట్‌గారూ! ఈ కంప్యూటర్ తూర్పు దిక్కున ఉంది. వాస్తు ప్రకారం దక్షిణంవైపు ఉండాలి. అలా మార్చండి"

"కానీ సైన్స్ ప్రకారం కంప్యూటర్ తూర్పుదిక్కున ఉండాలి. ఎందుకంటే దక్షిణంవైపున పవర్ కనెక్షన్ లేదు కాబట్టి"

"ఎలక్ట్రీషియన్‌ని పిలిపించి మార్పించండి" అని గొంతు పెంచాడు కొత్త మేనేజర్.

"ఎలక్ట్రీషియన్ సెలవులో ఉన్నాడు" అని చెప్పాను కంప్యూటర్ కదిపితే కొత్త సమస్యలు వస్తాయని.

"అందుకే ఒకళ్ల మీద ఆధారపడను నేను" అంటూ గబగబా ఎలక్ట్రిక్ సాకెట్ పీకాడు. స్క్రూ సరిగ్గా లేక సాకెట్ ఊడి చేతిలోకి వచ్చి వైర్ తగిలి షాక్ కొట్టింది.

దెబ్బతో కిందపడ్డాడు.

పైకి తీసి "కంగారు ఎందుకు. రేపు నేను మార్పిస్తాగా?" అన్నాను.

వామనరావు రూమ్ నుండి బయటకువచ్చాక అనుకున్నాను వాడి కంప్యూటర్‌లో వైరస్ లేదు, కానీ బుర్రలో వాస్తు వైరస్ బాగా వ్యాపించిందని.కొత్త మేనేజర్ వ్యవహారం చూస్తుంటే విసుగుతోపాటు నవ్వూ వస్తోంది.

***

నాలుగురోజుల తరువాత వానమరావు ఎవరితోనో ఘర్షణ పడుతున్నాడు.

విషయం ఏమిటంటే క్యాష్‌బాక్స్ ఈశాన్యంలో ఉందిట.

అది నైరుతి వైపు పెట్టాలంటాడు.

క్యాష్‌బాక్స్ ఐరన్‌ది, ఒక టన్ను బరువుంటుంది.

మార్చడానికి పదిమంది కూలీలు కావాలి. లేబర్ ప్రాబ్లం అంటే వినడంలేదు. ఎలాగో తిప్పలు పడి తుకారాం అక్కౌంట్స్ అసిస్టెంట్ నైరుతివైపు క్యాష్ బాక్స్ పెట్టించాడు.

క్యాష్‌బాక్స్ నైరుతివైపు పెట్టిన రెండురోజులకే దొంగలు పడడమేకాదు, క్యాష్ బాక్స్ సైతం ఎత్తుకుపోయారు.

"వాస్తు ప్రకారం క్యాష్ పెరగాలి కదా" అన్నాడు వామనరావు ఆందోళనగా.

"సైన్స్ ప్రకారం క్యాష్ పెరిగిందికదా దొంగల దగ్గర" అన్నాను నేను.

వామనరావు వచ్చాక డిపార్ట్‌మెంట్ వర్కు ఆలస్యం అవుతోందని, దిక్కుల ప్రకారం వస్తువులు స్థానభ్రంశం చేస్తున్నాడని, సమయం వృధా చేస్తున్నాడని హెడ్ ఆఫీసుకి ఫిర్యాదులు వెళ్లాయి.

***

"చెక్‌మీద సంతకం పెట్టండి" అడిగాడు తుకారాం.

"ఇప్పుడు అర్జంట్ పని వుంది. పన్నెండు తరువాత రా" అన్నాడు వామనరావు.

"ఈరోజు శనివారం. పన్నెండు తరువాత బ్యాంక్ ఉండదు"

"నాకు తెలియదు ఆ సంగతి. పన్నెండు తరువాత సంతకం పెడతాను"

తుకారాం తిట్టుకుంటూ పోయాడు. సమయానికి చెక్ బ్యాంకులో జమ చేయకపోవడంవల్ల పార్టీ తిట్లు తిట్టి సప్లయ్ లేట్ చేసింది.

దాంతో వామనరావుకి మెమో వచ్చింది. అయినా మనిషి మారలేదు.

***

కొలీగ్ స్వరూప్ విచారంగా ఉన్నాడు కంప్యూటర్ సెక్షన్‌లో.

"విషయం ఏమిటి?" అని అడిగాను.

వామనరావు సెలవు ఇవ్వడం లేదన్నాడు.

"మొన్న మా బామ్మ పోయిందని సెలవు కావాలంటే, 'మా బామ్మ పోయింది. నేను వెళ్లానా? మా అన్నయ్య చూసుకున్నాడు' అని అన్నాడు. ఇలా ప్రతిసారీ మా అన్నయ్య చూసుకున్నాడు అని చెప్పి సెలవు ఇవ్వడంలేదు" అని వాపోయాడు స్వరూప్.

"ఈసారి శోభనం అని సెలవు పెట్టు" అని సలహా ఇచ్చాను.

సాయంత్రం స్వరూప్ బస్టాండ్ దగ్గర కనిపించాడు.

"ఏమయింది?" అని అడిగాను.

"పాత ధోరణిలోనే 'నా శోభనానికి నేను వెళ్లానా? మా అన్నయ్య చూసుకున్నాడు' అని నాలిక కరుచుకుని ఐనా శోభనం రాత్రికదా. ఓ గంట పర్మిషన్ తీసుకో అన్నాడు" విచారంగా చెప్పాడు స్వరూప్.

***

ఆ రోజు ఉదయమే నన్ను పిలిచాడు. మళ్లీ ఏం గోలో... కంప్యూటర్ వాస్తు ప్రకారం అంటూ గాలిలో పెట్టమంటాడో? ఏమిటో అనుకుంటూ వెళ్లాను.

"వెంకట్‌గారూ! ఆఫీసు షిఫ్ట్ చేస్తున్నాం. రోడ్ నెంబర్-3లో మంచి బిల్డింగ్ చూసాను. వాస్తు ప్రకారం అన్ని విధాలా బాగుంది. మీ కంప్యూటర్లు, నెట్‌వర్క్ అదీ చూసుకోండి. కొత్త బిల్డింగ్‌లోకి వెళ్లాక ఆ సమస్యా ఈ సమస్యా అని పని స్పీడ్ తగ్గకూడదు" అన్నాడు వామనరావు.

'ఇక్కడేదో మహా పని స్పీడుగా వెడుతున్నట్లు

బిల్డప్' అని మనసులో అనుకున్నాను.

"కొంచెం రెంట్ ఎక్కువే అనుకో. కానీ వాస్తు దృష్టిలో పెట్టుకుంటే ఇంతకంటే మంచి బిల్డింగ్ దొరకదు" మళ్లీ చెప్పాడు వామనరావు.

'నీ సొమ్మేం పోయింది. కంపెనీ సొమ్ము ఖర్చు పెట్టు' అని మనసులో అనుకున్నాను.

"ఏ రోజు షిఫ్టింగ్?"

"సోమవారం. చాలా మంచిరోజు. ఆ రోజు అసలు రాహుకాలం లేదు."

"నువ్వు వచ్చాక మాకు రాహుకాలం ప్రారంభ మయింది"

"ఏదో అంటున్నావు?"

"ఏంలేదు. చాలా బాగుంది అంటున్నాను."

"వెంకట్! నా కంప్యూటర్ కీ బోర్డులో క్యాపిటల్ లెటర్స్ రావడంలేదు. వైరస్ అంటావా?" ఈమధ్య కంప్యూటర్ నాలుగు ముక్కలు నేర్చుకుని నా దగ్గర ఒలకబోస్తున్నాడు.

"వైరస్ కాదు, క్యాప్స్‌లాక్ ఆన్ చేయాలి"

"నేనూ అదే అనుకున్నా"

మళ్లీ ఇదో బిల్డప్. వామనరావు రూం నుండి బయటకి వచ్చాను.

డిస్పాచ్ క్లర్క్ లంబోదరం కనిపించాడు. విషయం అడిగాడు. ఆఫీసు షిఫ్టింగ్ గురించి చెప్పాను.

విషయం విన్న స్వరూప్ అన్నాడు "చరిత్రలో ఒక మహానుభావుడు ఉన్నాడు. మహమ్మద్ బీన్ తుగ్లక్ అని. అతను ఈలాగే రాజధానిని ఢిల్లీ నుండి దౌలతాబాద్‌కి మార్చి జనాన్ని ఇబ్బంది పెట్టాడు. తుగ్లక్ చచ్చి వామనరావుగా పుట్టాడా అనిపి స్తోంది."

ఆఫీస్ షిఫ్టింగ్ అనగానే లంబోదరం గంతేసి ఈలవేసి ఆనందంతో ఊగిపోయాడు.

ఎందుకురా అంటే సులువుగా రెండురోజులు



పని ఎగ్గొట్టవచ్చు.

అదీగాక కొలీగ్ సునయనతో సొల్లు కబుర్లు చెప్పడానికి బోలెడు ఖాళీ దొరుకుతుంది. ఇలాంటి ఛాన్సులు ఎప్పటికోగానీ రావని అన్నాడు. ఇంకా చాలా లాభాలున్నాయన్నాడు.

అనుకున్న రోజున వర్షంలేని సమయంలో ఆఫీసు షిఫ్టింగ్ ప్రారంభమయింది.

నా విషయంలో చాలా ఇబ్బంది. మొత్తం కంప్యూటర్ నెట్‌వర్క్ డిస్టర్బ్ అయింది. అయినా ఓపిగ్గా అన్ని కంప్యూటర్ల వివరాలు రాసుకున్నాను. ఫైల్సన్నీ లారీలో ఎక్కించమంటే కొన్ని కావాలనే మర్చిపోయి సునయనతో సొల్లు కబుర్లు చెబుతున్నాడు లంబోదరం.


పెద్ద ఘనకార్యం చేసినట్లు వామనరావు 'ఇంకా కాలేదా? ఇంకా కాలేదా' అని హడావుడి చేస్తున్నాడు.

***



## మేకప్పే సర్వస్వం!

మధ్యతరగతి మహిళలు సైతం మేకప్‌లకు అతిక ప్రాధాన్యత ఇస్తున్న రోజులివి. మరి సినిమా తారల సంగతి చెప్పేదేముంది? షూటింగులున్నంత సేపూ పాపం వాళ్ళు మేకప్‌లోనే వుండాలి. ఎప్పుడో ఇంటికి చేరుకున్నాక దాన్ని తీసేస్తారు. ఏవైనా ఫంక్షన్లకి వచ్చినా కూడా చాలావరకు మేకప్‌లోనే వస్తుంటారు తారలు. బాలీవుడ్ భామ సెలీనా జైట్లీ ఈ విషయంలో మరో అడుగు ముందుకేసి జిమ్‌కెళ్ళినప్పుడు కూడా మేకప్ లేనిదే కదలనంటోంది. వ్యాయామం అయ్యాక మళ్ళీ ముఖానికి టచప్‌లు చేసుకుని మరీ ఇంటికి బయల్దేరుతుందిట. మేకప్ అంటే ఆమెకెంత ఇష్టమోకదా.




ఆఫీస్ షిఫ్టింగ్ అయ్యాక ఎవరు ఎక్కడ కూర్చోవాలో సమస్య అయింది. కంప్యూటర్ సమస్యలు తగ్గడానికి అందర్నీ ఒకే హాలులో కూర్చోమన్నాను. కానీ వామనరావు ఊరుకోలేదు. మేనేజర్ని అన్నాడు, వాస్తువిద్వాన్ అన్నాడు. వాస్తు ప్రకారం అందర్నీ కూర్చోబెట్టాడు. వాస్తుకు సంబంధించిన విషయాలలో తనకెంతో ప్రావీణ్యం ఉందని చెప్పుకున్నాడు. తనను గురించి తనే గొప్పలు చెప్పుకుంటుంటే మాకందరికీ విసుగేసింది.

నా రూమ్ మరీ చీకటి అయింది. వారంరోజుల తరువాత అందరం కొత్త ఆఫీసు వాతావరణానికి సర్దుకున్నాం. అప్పుడే హెడ్డాఫీసు నుండి వామనరావుకి మెమో వచ్చింది.

బ్యాలెన్స్ షీట్ సమయంలో పని ఆపి ఆఫీసు షిఫ్టింగ్ పెట్టాడనీ, సమయం వృధా అయ్యిందని, సమర్థతలేని మేనేజర్ అని డిమోషన్ చేసి వేరే చోటుకి ట్రాన్స్‌ఫర్ చేసారు.

వామనరావుకి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది.

వామనరావు నన్ను పిలిచాడు.

డిమోషన్ ఉత్తరం ఉంది చేతిలో. విషయం నాకు తెలియదనుకుని "నన్ను ప్రమోషన్‌మీద వైజాగ్ ట్రాన్స్‌ఫర్ చేసారు. మీ సహకారానికి కృతజ్ఞతలు" అన్నాడు వామనరావు.

లోభి వామనరావు పార్టీ అని నలభైమందికి రెండు పెప్సీ బాటిల్స్‌తో పార్టీ చేసాడు.

***

సికింద్రాబాద్ స్టేషన్ హడావుడిగా వుంది. గోదావరి రావడానికి ఇంకా ఐదు నిముషాలు ఉంది. వామనరావుకి సెండాఫ్ ఇవ్వడానికి నేను, స్వరూప్, లంబోదరం వెళ్ళాము. కాస్సేపు వామనరావుని ఏడిపించడానికి నిశ్చయించుకున్నాము. ఎందుకంటే ఇన్నాళ్ళు మమ్మల్ని ఏడిపించాడు. ఇక అతన్ని మేమేడిపించాలని నిర్ణయించుకున్నాము.

"సార్! ఇప్పుడు మీరు వెళ్లడానికి వీల్లేదు" అన్నాడు లంబోదరం.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? పిడపర్తివారి పంచాంగం ప్రకారం రాహుకాలం."

"తంగిరాలవారి ప్రకారం వర్జ్యం" అన్నాడు స్వరూప్.

"ఇప్పుడు వెళితే, ట్రైన్‌కి, మా ప్రియతమ మేనేజర్ వామనరావుగారికి ఏమైనా అయితే నేను తట్టుకోలేను" అన్నాను నేను.

"అది ట్రైన్‌కి అన్వయించదు నాయనా! వేరే పనులకి" అన్నాడు వామనరావు గడుసుగా.

"లేదు సార్! మీరు వెళ్లడానికి వీల్లేదు" అని చెరో చెయ్యి పట్టుకున్నారు లంబోదరం, స్వరూప్‌లు.

"వదలండ్రా! ఇదేం పోయేకాలం?" అన్నాడు వామనరావు గాబరాగా.

"సార్... మిమ్మల్ని రాహుకాలంలో వదలడమా?"

గార్డు పచ్చజెండా ఊపాడు. ట్రైన్ నెమ్మదిగా కదిలింది.

"ఒరే బాబూ... ట్రైన్ మిస్ అయితే మళ్లీ పదిరోజులదాకా కన్‌ఫర్మ్ టిక్కెట్ దొరకదు" అని వామనరావు గుంజుకుని రన్నింగ్ ట్రైన్ ఎక్కాడు.

కానీ ఎక్కింది తన కోచ్‌కాదు. వేరే కోచ్. ఎక్కేటప్పుడు డోర్ దగ్గర ఉన్న పంజాబీని ఢీ కొట్టాడు.

పంజాబీ అతను కోపంగా అతని వంక చూస్తూ "అరే పుత్తర్" అంటూ వామనరావుని తిట్లు లంకించుకున్నాడు.

నవ్వుకుంటూ మేము ఇంటిదారి పట్టాము కొత్త మేనేజర్ ఎప్పుడు వస్తాడా అని అనుకుంటూ.

★